("జ్యోతి" మాసపత్రిక-ఫిబ్రవరి 1968)

పూర్ క్రీచర్స్

సాయంత్రం అయిదు దాటింది.

జనం హోటలుకి ముమ్మరంగానే వస్తున్నారు, కళ్ళకి చేతులకీ తీరుబాటు వుండడమే లేదు. అలా అంతపనిలో కౌంటర్ దగ్గర కూచున్నాసరే ఎందుకో నిద్దర ముంచుకొస్తున్నాది. అంతలా అలిసిపోయున్నాను. ఎప్పుడో పన్నెండున్నరకనగా వెళ్ళేడు, మా అల్లుడు ఇంటికి. "ఇప్పుడే వొస్తాను మామయ్యా, చిన్న నిద్దరతీసి; రాత్తిరి రెండో ఆట కెళ్ళేంకదూ. నిద్దర్లేదు" అని. అలాగే నిద్ద రోతున్నాడు గాబోలు, ఇప్పటిదాకానూ.

"ఏంటయ్యా! ఎక్కడ సంపాదించేవు, ఈ సెర్వర్లూ ఈ సజ్జూను!" అని విసుక్కుంటూ ఇచ్చ రూపాయి టేబిల్ మీదున్న గాజువలకమీద ఫెడీమని కొట్టేడు, వో పెద్దమనిషి. దాంతో ఈ లోకంలో పడ్డాను.

మా హోటలుకి రోజూ వాడుకగా వొచ్చే మనుషుల్లో వొకడూ అతను. పోల్చేను.

"ఏం బాబూ? ఏమైంది?" అన్నా; వీలైనంత అణకువ నటిస్తూనూ.

"ఏమిటైందంటా వేమిటయ్యా, మెల్లిగాను. ఈ మాత్రం ఆ మాత్రం బేరం వుండేసరికల్లా ఏదో గుడ్డిలో మెల్ల అన్నట్టుగా మీ ప్రొప్రయిటర్లు బాగా మర్యాదగానే వుంటారుగాని సెర్వర్లకి కళంభూమ్మీదుంటాయా? రవ్వదోసెతెచ్చి కాఫీ యివ్వరా నాయనా అంటే కాఫీ ముందిచ్చేసి రవ్వదోసె కాలుత్నాదండీ అంటాడు! నాయిగున్నరకనగా దూరేను, ఈ గూభ్యంలో. ఇప్పుడూ, బయట పడ్డం!—ఎప్పుడొచ్చినా నేరకపోయి ఒచ్చాన్రాబాబూ అనిపించేస్తే ఇంకెందుకూ హోటళ్ళు?" అంటూ మధ్యలో రిస్టువాచీ నా కళ్ళముందు ఆడిస్తూ నేనిచ్చిన చిల్లర లెక్కపెట్టుకోకుండా జేబులో పడేసుకుని వెళ్ళిపోయాడు. అది చిరాకన్న మాట.

అతనింతసేపూ కూచుని వెళ్ళిన చోటువేపు అనుకోకుండా చూసేను. అక్కడ వీరయ్య సప్లయ్ చేస్తున్నాడు. వీరయ్య అసలు వసంత విహార్ సప్లయరు; రిలీవర్‌గా వొచ్చేడు. లేకపోతే అక్కడ నటేశన్ వుండవలసింది.

నటేశన్ వున్నా మురుగన్ వున్నా నేనింక హోల్లోకి తిరిగి చూసుకోనక్కర లేదు. వచ్చేవాళ్ళ మొహాలూ- వెళ్ళేవాళ్ళ బిల్లులూ శ్రద్ధగా చూసుకుంటే చాలును. ఇవాళ శనివారం- వాళ్ళిద్దరికీ ఆఫ్.

నటేశనూ, మురుగనూ మాణిక్యాల్లాంటివాళ్ళు. కస్టమర్స్ కిచ్చిన మర్యాద, నా వ్యాపారానికి ఎంత సాయం చేసిందో మాటల్లో చెప్పడం కష్టం. ఇద్దరూ వో రోజే ఆఫ్ ఎందుకర్రా బాబూ అని నేను ఒప్పుకోలేదు. మా అన్న దమ్ములిద్దర్నీ విడదీస్తారాసార్ అని వాళ్ళూ ఒప్పుకోలేదు. సరేపోండి అని నేనే ఒప్పుకున్నాను, ఆఖరికి.

వాళ్ళిద్దరూ అన్నదమ్ములుకారు. ఒక ఊరివాళ్ళేమో అంటే అదీ కాదుటా, పోనీ ఒక స్కూల్లో ఒక క్లాస్‌లో చదువుకున్న వాళ్ళు, ఒక ఆఫీసులో పనిచేసిన వాళ్ళు, ఒక రూమ్‌లో అద్దె కుండినవాళ్ళు—ఇలాంటి వాళ్ళెవరేనా సరే, అంత స్నేహంగా వుండడం మీ రెవరూ యెక్కడా చూసుండరు. ఒక్క హూటల్లో సెర్వర్లుగా వుండడంవల్ల ఇలాంటి గొప్ప స్నేహం ఏర్పడుతుందని నేను చెప్పడంలేదు- నేనేమీ చెప్పలేను. వాళ్ళ స్నేహం, ఆత్మీయతా యింతలా బలపడిపోడానిక్కారణం నేనూహించలేను, అసలు.

వాళ్ళు మా హోటలుకి సెర్వర్లుగా వచ్చిన పన్నెండేళ్ళలో కొద్దిసార్లు ఎప్పుడో అప్పుడప్పుడు—వాళ్ళింత స్నేహంగా వుండటానికి కారణం ఏమిటో కనుక్కోవాలని నాకు మహా అనిపించింది. నేనడిగినప్పుడల్లా పళ్ళన్నీ బైట పెట్టి నవ్వేసేవాళ్ళు. మరెవరు అడిగినా అంతేట. వాళ్ళ భాషలో ఏదేదో అనుకుంటారుట; పైగానూ.

వాళ్ళ మైత్రికి మా రుబ్బింగు భద్రయ్య చెప్పే భాష్యం చాలా పౌరాణికంగా వుంటుంది. ఎప్పుడో ఎక్కడో వీళ్ళిద్దరూ వొకరికి తెలియకుండా వొకరు ఓ పిల్లని, ఒకే పిల్లని ప్రేమించారు; ఆ పిల్ల వీళ్ళిద్దర్నీ ఆట్లాడించి చివరికి వీళ్ళిద్దరికీ మధ్య తగూ పెట్టింది; ఇద్దరూ కొట్టుకున్నారు; మళ్ళీ వాళ్ళలో వాళ్ళే ఇదంతా ఆ పిల్ల చేసిన కుతంత్రం అని కనిపెట్టి రాజీకి వొచ్చేరు— అంటాడు.

కొట్టుకొని రాజీకొచ్చిన తరువాత ఏర్పడ్డ స్నేహం మామూలు స్నేహం కంటె దిట్టంగా వుంటుందనే అభిప్రాయం మామూలు మనుషుల్లో చాలా ప్రచారంలో వుంది. అరెరె, కొట్టుకున్నాం సుమా అని పశ్చాత్తాపపడ్డ తరవాత

హఠాత్తుగా విలువలు తెలిసిపోయి ఇనుమడించిన ప్రేమాభిమానాలతో ఒకర్నొకరు చూసుకొంటారన్న మాట దీని కాధారం కాబోలు. ఏమైనా సరే, భద్రయ్య చెప్పిన భాష్యం చాలామంది నమ్మేరు. ఎందుకంటే, ఇద్దరు మొగాళ్ళు కొట్టుకుందికి ఆడదంత బలమైన కారణంలేదు, అంతస్తునిబట్టి ఆ కొట్టుకోడం పద్ధతీ, అది సృష్టించే చరిత్రా మారొచ్చు. ఆవేశంమాత్రం అంతటా వొకటే.

మొత్తంమీద ఇరవై నాలుగ్గంటలూ ఒకేచోట వుంటూ, ఒకేచోట తింటూ ఒకేచోటికి తిరుగుతూ వుండే ఈ మురుగన్ నటేశన్లు మా హోటలుకి సంబంధించిన జనం అందర్లోను ఉత్తమ స్నేహానికి వొక ఉత్కృష్టమైన ఉదాహరణ ఏర్పరచేరు.

రిక్షాలోంచి మా అల్లుడు దిగేడు. అమ్మయ్య అనుకున్నాను.

అతను చేసిన ఆలస్యానికి అతన్నెలా చివాట్లు పెడితే బావుంటుందా అని మాటలు వెతుక్కుంటున్నాను; అతను మెట్లెక్కి లోపలి కొస్తున్నంత సేపూ తీక్షణంగా అతనివేపు చూస్తున్నాను. అతను మాత్రం నా చూపులు లక్ష్య పెట్టక గబగబా గల్లాపెట్టి దగ్గిరకొచ్చి. 'వేగిరం రెడ్డిగారి హాస్పిటలుకి వెళ్ళు మామయ్యా' అన్నాడు. 'ఆ వెధవలిద్దరూ చిత్తుగా తన్నుకున్నారు.'

నా చెవుల్ని నేనే నమ్మలేక పోయేను. నటేశన్, మురుగన్- స్నేహానికి ఉత్తమమైన ఉదాహరణ- వాళ్ళిద్దరూ— కొట్టుకున్నారుట. చర్మాలు గీసుకు పోయి. నెత్తుర్లు కారుకుంటూ, బుర్రలు బద్దలై హాస్పిటల్లో వున్నారుట.

* * *

'ఉండుండి. మా మంచిపని చేసేర్లెండి, మీ వాలి సుగ్రీవులిద్దరూను!' అన్నాడు డాక్టర్ రెడ్డి, నన్ను చూడగానే.

నా ప్రాణం ఉసూరు మంది.

'కొట్టుకుంటే కొట్టుకున్నారుగాని వాళ్ళనలా అనకయ్యాబాబూ' అన్నాను.

'మరేమి టనమంటారు? రామ లక్ష్మణు లనమంటారా, బలరామ కృష్ణు లనమంటారా?'

అతని పరిహాసానికి నొచ్చుకున్నాను. 'రామలక్ష్మణు లనవలసిందే. ఇవాళ ఏదో కొట్టుకున్నారని ఇన్నాళ్ళనించీ నేను చూస్తున్న వాళ్ళ స్నేహమంతా అబద్ధమయి పోతుందిటయ్యా?'

'సరేలే. 'ఏదో' కొట్టుకోడమా అది!' అంటూ డాక్టర్ రెడ్డి లేచేడు. 'పదండి, మీ రామ లక్ష్మణుల్ని చూద్దురుగాని' అన్నాడు వేళాకోళంగా నవ్వుతూ.

అతని వెనకాతలే వెళ్ళేను.

'వాళ్ళని వాలి సుగ్రీవులంటూనే పక్కపక్కని పడుకో బెట్టేరే!.... వేరే చోటుకి నో మంచం మార్చండి బాబూ మీకు పుణ్యముంటుంది! లేకపోతే ఒంటిమీద తెలివి రాగానే మళ్ళీ తన్నుకుంటారేమో' అన్నాను.

'అవునండోయ్!' అన్నాడు రెడ్డి, కళ్ళు పెద్దవి చేసుకుంటూ.

వాళ్ళిద్దరి మంచాలకీ మధ్య మా సర్వయర్ సుబ్బయ్య స్టూల్ వేసుకుని కూచున్నాడు. మమ్మల్ని చూసి లేచేడు.

'ఏమయ్యా, సుబ్బయ్యా! నువ్వు- నువ్వేనేమిటి, వాళ్ళిద్దర్నీ హాస్పిటలుకి తీసుకొచ్చేవు?' అని వాణ్ణి పలకరించేను.

'లేదండీ........ నే నుట్టినే. వాళ్ళిక్కడున్నారని కబురు తెలిసొచ్చేను.'

'నేనండీ, తీసుకొచ్చేను!' అంటూ మా పక్కనించి ఓ నల్లటి కుర్రాడు ముందు కొచ్చాడు. పాతికేళ్ళుండవు.

'సోమయ్యగారి మామిడితోట్లో నూతి దగ్గిరండీ. వీళ్ళిద్దరూ కొట్టుకోడం, మధ్యాహ్నం మూడున్నరకి-' అన్నాడా అబ్బాయి.

నేను ఆశ్చర్యంగా చూసి 'చెప్పు' అన్నట్టు కళ్ళూ బుర్రా ఆడించేను. 'ఊఁ' అన్నాను.

'నేను సమంగా అదే టైముకి రోడ్డుమీంచి సైకిల్ తొక్కుకుని వొచ్చేస్తున్నానండీ. తోట్లోంచి ఏవో అరుపులు వినిపిస్తూపుంటే ఏమిట్రా అని సైకిలాపి చెట్లల్లోంచి తొంగి చూసేనండీ. అఘాత్తుగా వాడు (మురుగన్) వీడిమీదికి ఒక్క ఎగురు ఎగిరేడండీ. ఇంకేమున్నాది, ఇద్దరూ కలబడ్డారు. సైకిలుకి తాళం వేసి తోట్లోకెళ్ళేను. ఇద్దర్నీ విడదీద్దామని మధ్యకెళ్ళేను. ఇద్దరూ నన్నడ్డు లెమ్మని గోలచేసేరు. అరె, మీకేమన్నా బుద్ధుందాలేదా, పదండి అవతలికని చెరో రెక్కా పట్టుకున్నానో లేదో, ఇద్దరూ వొక్కమాటు నన్ను దులిపేసేరు. దాంతో కిందపడ్డాను. ఇదుగో, కాలి ముణుకు గీసుకు పోయింది—— పెద్దదెబ్బ కాదులెండి——'

'అసలెందుకు కొట్టుకున్నార్ట!'

'ఏమో!'

'మరి నువ్వు అంత దగ్గిరగా వెళ్ళేవుకదా, అడగలేకపోయావూ?'

'అడక్కపోవడమేం, అడిగేను!.... నాకు దెబ్బ తగలకముందేమో అసలు వాళ్ళని విడిపిస్తే చాలనుకున్నాను. వెంటనే ఎందుకో కనుక్కోవాలని నాకూ అనిపించింది, అసలేమిటర్రా, చెప్పండని మళ్ళీ వాళ్ళ మధ్య దూరేను.. నాతో మాట్లాడ్డం సంగతటుంచి, వాళ్ళలో వాళ్ళేనా అసలు మాట్లాడుకున్నారు గాదు.... ఫెడీ అంటే ఫెడీ అని వొకటే గుద్దుకోడం, ఒకటే కిందపడి దొర్లడం.... ఇంతట్లో వీడు (మురుగన్) వాణ్ణి నూతి చప్టామీదికి ఒక్క దెబ్బని విసిరికొట్టేడండి. దాంతో వాడిబుర్రబద్దలైపోయిం దనుకున్నాను. వాడు పడి పోతూ పడిపోతూకూడా, గబుక్కునలేచి, అక్కడ ఇంత వలం దుడ్డుకఱ్ఱ ఒకటుంటే దాంతో వీడి బుర్రమీద ఒక్కటేసేడు. కొట్టుకుని కొట్టుకుని అలిసి పోయున్నారేమో, వాళ్ళ దెబ్బలు వాళ్ళే తప్పించుకోలేకపోయేరు .... ఇద్దరూ తెలివితప్పి పడిపోయేరు—'

"ఇంతకీ ఎందుక్కొట్టుకుంటున్నారో తెలీదంటావు."

"నాకు తెలీదు. తెలివొస్తే వాళ్ళే చెప్పాలి. అంతవరకూ బ్రహ్మరుద్రుల క్కూడా తెలీదు."

"అక్కడింకెవళ్ళూ లేరా?"

"ఇంకొకాడుంటే ఇంతలా కొట్టుకో నిద్దుంవా? ఇద్దరం చెరోణ్ణీ పట్టు కొని పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చి అప్ప చెప్పేద్దుం!"

"తరవాతేమిటైంది?"

"తరవాత ఇంకేముంది! రోడ్డుమీది కొచ్చి నలుగుర్నీ కేకేసి, ఓ రిక్షా ఆపి, మీ యిల్లు దార్లోనేకదా, అని మీ కప్ప జెబ్దామని తీసికెళ్ళేం— వీళ్ళిద్దరూ మీ హోటల్లో సెర్వర్లని మాకు తెలుసున్లెండి—అక్కడ మీ అల్లుడుగారు కన పడి ఇక్కడికి తీసుకొచ్చేరు. అంతే."

"పోనీలే నాయనా; మంచి పని చేసేవు" అన్నాను. "పాపం, వీళ్ళ మూలంగా నీ క్కూడా దెబ్బలు తగిల్నట్టున్నాయ్."

"ఆఁ, దానికేముంది లెండి."

"ఊరంతా ఎక్కడా చోటులేనట్టు ఎక్కడో ఆ సోమయ్యగారి మామిడి తోట్లో ఎందుకూ. ఈ కొట్టుకోడం?"

నా కెవరూ సమాధానం చెప్పలేదు.

డాక్టర్‌తో చెప్పవలసిన మాటలు చెప్పేసి ఈవెనింగ్ వాక్‌కి బయల్దేరేను.

* * *

చిరాకుగా వుంది. నిద్దరొస్తున్నట్టుంది. చల్లటి నీళ్లలో స్నానం చెయ్యాలని కోరిగ్గా వుంది. డాగా ఆకలేస్తున్నాది. ఇవన్నీ కాక మనస్సులో బాధ ఏదో పుట్టి ఒళ్ళంతా చిట చిట లాడుతున్నట్టుంది. వేగిరం వెళ్లొచ్చేయాలి.

వెధవలిద్దరూ పదిరోజులు హాస్పిటల్లో వుండాలిట. వ్యాపారం బాగా దెబ్బ తింటుంది, ఒక్కరోజు లేక పోయీ సరికల్లా ఇందాక అయిందిగా, శృంగభంగం? .... అనుభవం వున్న పనివాళ్ళు. అలా వంటశాల్లోంచి ఇలా హాల్లోకి తెచ్చి అందించడమే కదా అనుకుంటాం గానీ, దానిలో ఇబ్బందులు దాన్లోనూ వున్నాయి. పాత సెర్వర్లు ....వీళ్ళతో పాత పేసింజెర్లకి చాలామందికి అలవాటు....ఎవడికి ఉల్లి చెట్నీయో ఎవడికి శనగ చెట్నీయో మొహం చూసి తెచ్చిచ్చేస్తారు. వాళ్ళు గుప్ చప్‌గా తినేసి ముచ్చటగా మూత్తుడునుకుంటూ కాతా బుక్కు అందుకొని రాసేసి వెళ్ళిపోతారు, ఏ రోజు కారోజు కొత్త పేసింజర్లే ఎక్కువైనా పాతవాళ్ళలో వొక్కడికియిబ్బంది కలిగితే వాళ్లూ ఊరుకోరు, మాకూ బాధే.

ఇవాళ తీరి కూర్చుని ఇంత ఘోరానికి తలపడ్డారు.

వ్యాపారం సంగతి అలా వుంచి, ఏమిటో వాళ్ళకి ఇంతలేసి దెబ్బలు తగిలేయంటే బాధగా వుంది. పన్నెండేళ్ళనుంచి వాళ్ళు మా హోటల్లో పని చేస్తున్నారు. పదేళ్ళనుంచీ వాళ్ళని మా యింట్లో మనుషుల్లా చూసుకుంటున్నాం. సరుకు మాష్టర్ని నమ్మం; వంట వాళ్ళనీ నమ్మం: పాలవాళ్ళని అసలేనమ్మం. వాళ్ళందరిమీదా వీళ్ళిద్దరి నిఘా ఉంటేనేగాని రోజు వెళ్ళదు. ఎక్కడో ఏదో

తగలడిపోతుంది. పంటవాళ్ళూ సప్లయర్లూ కుట్రలు చేస్తాయి. పేళాకోళానికి చేసినా, సరుకులూ, సామాన్లూ దూబరా ధ్వంసం చేసేస్తారు. నేనా, మునపట్లా ఓపిగ్గా అన్నీ చూసుకోలేక పోతున్నాను, పెర్మిట్లూ డబ్బూ ఏర్పాటు చేసుకోడం, గల్లా పెట్టె దగ్గిర కూచోడం తప్ప, పొగలోకీ ఉక్కలోకీ వెళ్ళలేకపోతున్నాను, అల్లుడు సరేసరి. ఎప్పుడూ తనకి సరిగ్గా మర్యాద జరగడం లేదన్నట్టే పెడ తాడు, మొహం.

ఎందుకో, వీళ్ళిద్దరూ ఇలాగ కొట్టుకోడం !

భద్రయ్య చెప్తున్నట్టు ఏదేనా ఖామాకలాపం ఇందేమో. నా కెలా తెలియ నిస్తారు ?....కాఫీ హోటల్ ప్రొప్రయిటరు దగ్గిర సెర్వర్లు కూడా గవర్నమెంట్ డిపార్ట్మెంట్ లో డైరెక్టర్ దగ్గిర యల్ డీ సీలాగ బెదిరిపోతూ అనుబంధానికి వ్యక్తిగత స్పర్శ లేకుండా చేసుకుంటే ఇలాటి వివరా లందవు.

పోతే—డబ్బు విషయంలో ఏదేనా పేచీ వొచ్చుంటుందా? అలా జరి గుండదు. వీళ్ళు సంపాదిస్తున్నదెంత, అందులో మిగిల్చే దెంతుంటుంది? ఏదో కారణం చెప్పి నెలజీతం సగం ముందే ఎడ్వాన్సు తీసేసుకుంటారు— అది కూడా యిద్దరూ వొక్కరోజునే యిమ్మంటారు. ఏం చేస్తారో. ఎవరో వాళ్ళ దేశంలో ఉన్న వాళ్ళకి సంపుతారు గాబోలు.

కారణం ఏదైనా, మొత్తంమీద అజన్మ విరోధుల్లా కొట్టుకున్నారు.... వాళ్ళు మళ్ళా కలుసుకోవాలి.... ఒకర్నొకరు క్షమాపణ అడిగి క్షమించు కోవాలి.... ....అప్పుడు నా మనస్సు కుదుట పడుతుంది— వీళ్ళిద్దరూ ఈ కారణంమీద విడిపోతే చూస్తూ ఊరుకోగలనా!

నడిచి నడిచి సోమయ్యగారి మామిడితోట దాటేనని తెలుసు కున్నాను. టైమ్ చూసేను. ఆరు గావస్తోంది. రోడ్డు తూరుపు పడమర్లుగా వుంది. ముందుకి చూసుకొని నడుస్తూ వుంటే తిన్నగా కళ్ళలో పడుతున్నాయి సూర్య కిరణాలు. రోజూ ఇలాగే నడుస్తూ వుంటాను. రోజూ యిదే వేళ. రోజూ, ఇవాళ లాగే, అస్తమించ బోతున్న సూర్యబింబంలోకి చూడాలని అంతులేని కుతూ హలంగా వుంటుంది. చూస్తాను. చూస్తే సన్నటి మెరుగు పొలుసులు కళ్ళలో జీరాడి కళ్ళని అందమైన బాధలో పెడుతున్నాయి. కాని ఈ ఆకర్షణ ధన వ్యామోహంలా ఎప్పటికప్పుడే కొత్తగా వుంటుంది.

పాకలోకి వొంగి చూశాను. ఒక చాప పరిచి వుంది, గోడకి దగ్గిరి సాను ఆ చాపమీద గోడ వేపొకటీ ఇవతలి వేపాకటీ రెండు తల గడాలు అడ్డదిడ్డంగా పడేసున్నాయి. ఇంకొకటి నిలువుగా గోడకి నిలబెట్టుంది. పేకాట ఆడి వెళ్ళేరు ఎవరోను, పేక ముక్కలు ఎత్తలేదు. అలాగే పరిచేసి వున్నాయి.

ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాతల చచ్చినట్టు ఈ మురుగనూ నటే శనూ ఆఖరికి పేకాటాడి కొట్టుకున్నారా? ఇది సంభవమా? వాళ్ళ స్నేహానికి ఈ సంఘటనకీ అనుపాతం కుదరడం లేదే!

పాకలో కెళ్ళేను. డబ్బులేసి పేకాటాడుకొనే వాళ్ళు కొట్టు కోడం దాకా వొస్తే, పేక ముక్కలు ఎత్తడం మరిచిపోతే డబ్బులు కూడా తీసిజేబుల్లో పెట్టుకొనే తెలి వుండదు. ఈ పేకాట వెనకాతల ఏవేనా సీసాలూ గ్లాసులూ కూడ ఉన్నాయేమో చూడాలి.

చాప మీద నే ననుకున్నట్టు గానే చిల్లర డబ్బులు కూడా వున్నాయి. గూట్లోగాని మరెక్కడా గాని సీసాల వాసనలేదు. వీళ్ళు ఇంకా అ స్థాయి కి రా లే ద న్న మట.... ....

గోడకి చేరవేసిన తలగడా వెనకాతల ఏదో పంచిలాంటిది ఉన్న ట్టుందే?....తలగడాని చిన్న తావు తన్నేను. ఘల్లున చప్పుడు చేస్తూ తోలు సంచి నిస్సహాయంగా చాప మీద పడ్డది.

డబ్బు....

సందేహంలేదు, ఈ డబ్బే, ఈ తోలు సంచే, కారణం....

తోలు సంచి చాలా తమాషాగా వుంది. చుట్టూరా పకడ్ బందీగా కుట్టేసి వుంది. ఒక వేపు నుంచి సన్నటి సందుంది, దాంట్లోంచి డబ్బులు వెయ్యొ చ్చునేగాని తియ్యడానికి వీల్లేదు, లోపల సన్నటి తోలు పొర వొకటి డబ్బు లువేస్తే తెరుచుకోడానికి చాలినంత స్ప్రింగ్ ఏక్షన్‌తో వుంది, డబ్బులు తియ్యా లంటే అ పొ ర గట్టిగా అడ్డొస్తుంది. అటూ ఇటూ తిప్పి, దులిపి, బలా త్కారం చేసేను, ఒక్క నయాపైసా కూడా రాలలేదు, మంచి పనివాడితనం పుపయోగించి అందంగా క్లిష్టంగా కుట్టేరు.

తోలుసంచికి ఓ వేపు మలయాళంలోనూ ఇంకోవేపు ఇంగ్లీషులోనూ,

ఆర్. నటేశన్, కె. మురుగన్ అని గిల్టు అక్షరాలతో అందంగా రాయబడి వుంది.

పాపం, పూర్ క్రీచర్స్-ఈ డబ్బు కోసం కొట్టుకున్నారన్న మాట....
అయినా ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఆషాడభూతి కథలో సన్యాసి లాగ డబ్బు ఇలా సంచీలో పోసి దాచుకుంటారా?

ఏది ఏమయితేనేం-ఈ డబ్బు కోసం- పవిత్రమైన సుదీర్ఘ స్నేహ బంధాన్ని క్షణంలో మరచిపోయి చావుబెబ్బలు కొట్టుకున్నారు.... వెధవ డబ్బు-అ(- ఎంతుంటుంది. మహా వుంటే యాభై ఉంటుంది. నూరుంటుంది? లక్ష రూపాయలున్నా మాత్రం- అలా కొట్టుకోడమా? ఛీ!

ఆలోచించుకుంటూ రోడ్డుమీది కొచ్చేను.

ఇది వాళ్ళిద్దరి జాయింట్ బ్యాంక్. దీంట్లో ఎన్నో స్వేదబిందువుల ఫలం వుంది. దీనిమీద వాళ్ళ కెన్నో అశలున్నాయి. దీని కొక లెక్క ఉన్నాదో లేదో! లెక్కా డొక్కా వున్నా లేకపోయినా దీంతోఏంచెయ్యాలో వాళ్ళు ముందే అనుకొని వుంటారు-ఏముంది, హోటలు సెర్వర్లిలాగే కష్టపడి దాచి దాచి స్వంతంగా హోటలు పెడతారు. ఈ మూల ధనంమీద ఆశలు ఆధారంగా వాళ్ళిద్దరూ అహర్నిశలూ కష్టపడ్డమే కాక ఒకర్నొకరు అంటిపెట్టుకుని కూడా వుంటున్నారు. దీనివల్ల వాళ్ళ లోపల ఒకరిమీద ఒకరికి అనుమానం కాబోలు - అయినా, దీనివల్ల వాళ్ళ స్నేహం చిక్కబడింది. స్నేహబంధంవల్ల యిది పవిత్ర మైంది.

అయినా, ఇవాళ వాళ్ళిద్దరికీ దెబ్బలాట పెట్టిందీ యిదే—చెప్పలేం-ఎంత విచిత్రం!

డాక్టరుకి చాలా డబ్బు ఇవ్వవలసొస్తుంది. గ్లూకోజ్ ఇంజక్షన్లూ, రక్తం ఎక్కించడం ఆలాటి వేవో చాలా చెప్పేడు రెడ్డి. వంద రూపాయలు దాటొచ్చు వాళ్ళని నా కుటుంబంలో మనుషుల్లా చూడమన్నాను. అంత జాగర్తగా చూసి మరీ వైద్యం చెయ్యమని రెడ్డికి చెప్పేను. ఎంత డబ్బైనా సరే నేనే యిస్తాను.

పాపం-పూర్ క్రీచర్స్-క్షణంలో ఒళ్ళు మరచిపోయారు....వాళ్ళకేదేనా ఉపకారం కూడా చెయ్యాలి. నిజానికి ఈ సంచితో ఈ డబ్బు మళ్ళీ వాళ్ళకి ఇచ్చెయ్యడం కూడా ఓ వుపకారమే. కాని అది నా విషయంలో కేవలం డ్యూటీ. ఇది వాళ్ళకి జాగ్రత్తగా అందజేస్తాను. ఇదే కాదు. వాళ్ళు హోటలు పెట్టుకోడానికి మూలధనం తక్కువయ్యేటట్లయితే మరో యాభయ్యో వందో - ఎంత కావలిస్తే అంతకూడా నేనే యిస్తాను....

ఈ విధంగా వాళ్ళు నా వ్యాపారానికి చేసినమేలుకి బదులు తీర్చుకుంటాను.

నయం– ఇది ఇంకెవరి చేతుల్లోనైనా పడితే ఎంత ప్రమాదం జరిగి పోయేది!

ఒరే అబ్బాయిలూ, డబ్బు పాపిష్టిది; ఈ డబ్బుకోసం ఇంకెప్పుడూ కొట్టు కోమని ప్రమాణం చెయ్యండి– అని చెప్పి ఈ సంచి వాళ్ళకి వొప్పచెప్తాను. బాగా బుద్ధి చెప్తాను.

అదే మంచిది.

* * *

స్నానం చేసొచ్చేసరికి; మా మనవడు (తొమ్మిదేళ్ళవాడు) నేను నాపరుపు మీద దుప్పటీ కింద పెట్టిన ఆ తోలుసంచిని ఎప్పుడు కనిపెట్టేశాడో! కనిపెట్టి, పరుపుమీద మఠం వేసుక్కూచుని, ఆ సంచీ ఎలా తెరవడమా అని తికమక పడుతున్నాడు. వాడి గడుసుతనానికి ఏదో పుత్రోత్సాహం లాంటి నవ్వొచ్చింది. కొడుకైనా వాడే, మనవడైనా వాడే, నాకు. వాడికి ఇప్పట్నుంచే డబ్బూ, ఆ జాగర్తా అవన్నీ–ఊఁ—

'ఒరే, గోవిందు! అవలా పెట్టి వెళ్ళు!'

'ఇందులో ఎంతుంది తాతా'

'వెళ్ళరా, అంటే!'

'ఎంతుందో చెప్తే!'

అమ్మాయిని పిల్చి వాణ్ణి తీసికెళ్ళ మన్నాను.

జాగ్రత్తగా చూసేసరికల్లా వాడాసంచినిబ్లేడుతో కొద్దిగా కోసేడేని తెలిసింది. నేనింకో రెండు నిమిషాలు రాకపోతే వాడు ఆ సంచీని పూర్తిగా తెరిచే వుండేవాడు.

అది సరే—ఇప్పుడిదెలాగ! పాపం, వాళ్ళ సంచి–ఎన్నాళ్ళనించో వాళ్ళక్కూడా లెక్క తెలియని పద్ధతిలో డబ్బు దాచుకుంటున్న ఈ తోలుసంచి ఇలా కోసేశాడే, వీడు! దీనికి వాళ్ళ కేమని చెప్పడం?

–అఁ దానికేముంది బ్రహ్మాండం. ఇలా యిలా, మా మనవడు ఏదో తెలీక బ్లేడుతో చిన్న గంటు పెట్టేడని చెబితే సరి.

కాని, అసహ్యంగా వుంది. ఆగంటు.

పోనీ, పూర్తిగా కోసేసి, ఆ లోపలున్నదంతా తీసి వేరే సంచీలోనో, డబ్బీలోనో జాగర్త పెడితేసరి—

అప్పుడు అందులో వున్న డబ్బు ఎంతో కూడా సరిగ్గా లెక్క తెలుస్తుంది. లేకపోతే ఈ గోవిందుగాడు మళ్ళా వొచ్చి దులుపుకుంటే కొంత రాలి పడొచ్చు.

ఎంత సొమ్ముందో, అందులో?

ఎంత సొమ్ముకోసం వాళ్ళిద్దరూ అంత ఆవేశంలో పడ్డారో?

ఎంత, ఆ సొమ్మెంత?

గబగబా తలుపేసి బ్లేడు తీసి జాగ్రత్తగా ఆ తోలుసంచీ అంచు కోసేశాను. పరుపుమీద అంటకన్నా జాగ్రత్తగా మఠం వేసుకు కూర్చుని అందులో వున్న వన్నీ వొలకబోసేను.

అందులో—

నే నిందాక తాటాకు పాకలో నా చేత్తో పోసిన చిల్లర యధాతథంగా వుంది.

తొమ్మిది అర్ధరూపాయి నాణేలు........

పన్నెండు విచ్చు రూపాయలు....

ఇరవై మూడు బంగారు నవర్సులు.

రాళ్ళు పొదిగిన ఉంగరాలు; నాలుగు సాదావి మూడు—

ఇవి కాక

నోట్లు- మడతపెట్టి దారంవేసి కట్టి వున్నాయి.

అవి ముందుగా అక్కడ పెట్టి సంచీ అంచులు కుట్టినట్టున్నారు. లేకపోతే అవి ఆ సన్నటి సందులోంచి దూరవు.

పది రూపాయిల నోట్లు....ఒకటీ....రెండూ....అబ్బ! ముప్ఫైయ్యొకటి —ఓరిబాబో—యాభై రెండు—!

నూరు రూపాయల నోట్లు....ఒకటీ....రెండూ....మూడూ....నాలుగూ....పదీ....పదిహేడు—ఇరవై నాలుగూ....ముప్ఫయి మూడూ....ముఫ్ఫయ్యేడు!

మొత్తం-అమ్మబాబోయ్-

వీళ్ళ దగ్గిరింత డబ్బుందా?- వాళ్ళకి తెలుసునా. ఇంతుందని?- ఇంత డబ్బుండీకూడా నా హోటల్లో పనిచేస్తున్నారా!?

వాళ్ళ సిగ్గోసిరి- సమయానికి నాకు తెలిసిందిగాని లేకపోతే రేపో నేడో వేరే హోటలు పెట్టేసేవాళ్ళే- నాకు టోకరా యిచ్చేవాళ్ళే.

నే నెంత అదృష్టవంతుణ్ని!

ఎవరికేనా తెలుస్తుందేమో!

ఎలా తెలుస్తుంది? వాళ్ళకి నేను అక్కణ్నించి తీసి తెచ్చేనని తెలియాలి; వాళ్ళు ఎవరితోనైనా చెప్పాలి. అప్పుడు కదా, తెలియడం!

వాళ్ళెవరికీ పోయిందన్న సంగతేనా చెప్పరు....చెప్పలేరు!

నాకు తెలుసు- అది ఎక్కడో ఎత్తుకొచ్చిన సొమ్మే!

నయం- ఇది ఇంకెవరి చేతుల్లోనైనాపడింది కాదు।

* * *